# సారీ, నాకు నీ స్నేహం వద్దు

కె. సూరిబాబు

గడియారం వంక చూశాను.

సమయం సాయంత్రం ఐదున్నర కావస్తోంది.

అతనొచ్చేవేళయింది. అతను ఐదున్నర కొస్తాడు. అప్పటికి నేను పనులన్నీ ముగించుకుని అతనికోసం ఎదురుచూస్తూ ఉంటాను.

అతనొచ్చాక ఇద్దరం బయలుదేరి ఇంటి దగ్గరలో ఉన్న పార్క్‌కి వెళ్ళి కబుర్లు చెప్పుకుంటాము.



గంటసేపు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న విషయాలను గురించీ, సాహిత్యాన్ని గురించీ కబుర్లు చెప్పుకుని ఆ తరువాత ఎవ్వరిళ్ళకు వాళ్ళం వెళ్ళిపోతాము.

సంవత్సరం నుండి మా మధ్య స్నేహం కొన సాగుతోంది. రోజూ కబుర్లు చెప్పుకుని లేచేటప్పుడు అతను అయిష్టంగానే లేచి వెళ్ళిపోతుంటాడు.

అతనికేమో ఇంకా కూర్చోవాలనీ, మాట్లాడా లనీ ఉంటుంది. అయితే నా మాటకి ఎదురుచెప్పలేక ఊరుకుండిపోతాడు.

మళ్ళీ మర్నాడు ఐదున్నరకి ఎంతో హుషా రుగా వస్తాడతను. నేనుకూడా ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తుంటాను.

రోజూ ఇలా జరుగుతూనే ఉంటుంది.

కానీ - ఈ రోజెందుకో అతనికోసంఎదురు చూడాలనిపించటం లేదు. అందుకు నా మనసు అంగీకరించటం లేదు.

అతనొస్తాడని తలచుకుంటుంటే నా మనసు మండి పోతోంది. అతను గుర్తుకు రాగానే నా శరీరం తేళ్ళూ, జెర్రులు పాకినట్లు జలదరిస్తోంది.

ఇంతకాలం అతను వ్యక్తిత్వం ఉన్నవాడను కున్నాను. కానీ, అతనుకూడా అందరిలాంటి మగాడేనని ఋజువైంది.

ఈ విషయం నేను ముందుగా గ్రహించి ఉంటే, అతనితో నా స్నేహాన్ని ఇంతదూరం రానిచ్చేదాన్ని కాదు.

గ్రహించకపోవడంలో నా పొరపాటు కూడా ఉంది. ఆ పొరపాటుని ఇప్పటికైనా గ్రహించాను కాబట్టే జాగ్రత్త పడాలని నిర్ణయించుకున్నాను.

పరాయి మగాడితో ప్రతిరోజూ అలా కబుర్లు చెప్పుకుంటూ మాదానికి స్నేహమని పేరు పెట్టడం మీకు నచ్చకపోవచ్చు.

కానీ మాది స్నేహమే... సారీ... నాది స్నేహమే. ఇలా ప్రత్యేకంగా నా గురించే ఎందుకు చెప్పుకుంటున్నా

నంటే... ఇన్నాళ్ళూ అతనిలో కూడా నాలాంటి అభిప్రాయమే ఉందని భావించాను.

కాదని ఈరోజే తెలిసింది. నామీద అతనికున్న అభిప్రాయం వేరు. అతను మా పరిచయాన్ని 'స్నేహం'గా భావించడం లేదు. స్నేహాన్ని అడ్డుపెట్టుకుని నాతో తన 'అవసరం' తీర్చుకోవాలనుకుంటున్నాడు.

నేను వయసు తెచ్చిన అలజడికి తట్టుకోలేక నా కోరికలు అతనితో తీర్చుకోడానికే స్నేహం చేస్తున్నానని భావించాడతను.

అందుకే నేను ప్రత్యేకంగా నాది స్నేహం మాత్రమే అని చెప్పుకుంటున్నాను.

నా ఆలోచనలకూ, అభిప్రాయాలకూ పూర్తి విరుద్ధంగా ఉన్నాడని తెలిసి అతనిమీద పీకల్దాకా కోపంగా ఉంది. అంతకన్నా బాధగా ఉంది.

అతనితో ఈరోజు చెప్పేస్తాను. ఇకనుండి మా ఇంటికి రావద్దని. ఒక స్నేహితుణ్ణి దూరం చేసుకుంటున్నందుకు మాత్రం నాకు చెప్పలేనంత బాధగా ఉంది.

స్త్రీ ఒక మగాడి మీద ఒక మంచి అభిప్రాయాన్ని ఏర్పరచుకున్నపుడు ఇక అతను తను అనుకున్నంత మంచివాడు కాడని తెలిసినా అతనిమీద ఆ అభిప్రాయాన్ని అంత సులభంగా చంపుకుని అతణ్ణి వదులుకోలేదు.

ఈ బలహీనత వలనే స్త్రీ మగాడికంటే ముందు చెడ్డదైపోతుంది. నా విషయంలో కూడా అంతే.

రావద్దని చెప్పడానికి మాత్రం బాధగానేఉంది. అయితే చెప్పకుండా మాత్రం ఉండను. బాధయినా పర్వాలేదు. భరిస్తాను.

కానీ అతను నామీద ఏర్పరచుకున్న భావాని మాత్రం భరించలేను. మనసున్న ఏ ఆడదీ భరించలేదని నా ఉద్దేశ్యం.

ఒక్కసారిగా మనసు బాధతో గతంలోకి పరుగులు తీసింది.

నేను పుట్టింది చాలా పేదకుటుంబంలో- నా తర్వాత ఇద్దరు చెల్లెళ్ళు - ఇద్దరు తమ్ముళ్ళు. ఈదేశంలో తల్లిదండ్రులకి పిల్లల్ని పోషించేశక్తి లేకపోయినా కనే ఓపికమాత్రం ఉంటుంది.


ఇంత ఘాటుగా విమర్శించి నందుకు నామీద కోపం రావచ్చు మీకు- జీవితం నాశనం అయ్యేసరికి ఆవేశాన్నీ, దుఃఖాన్నీ ఆపుకోలేక అంటున్నాను.

నా విమర్శలో తప్పుమాత్రం ఏముంది చెప్పండి. పేదరికం దారిద్ర్యం మనదేశాన్ని పట్టిపీడిస్తున్న పిశాచాలని తెలిసీ కుటుంబనియంత్రణ పాటించకుండా అరడజన్లు, డజన్ల కొద్దీ పిల్లల్ని కనడం క్షమించరాని నిర్లక్ష్యం.

అదేమంటే భగవంతుడు ఇస్తుంటే కాదనడం మహాపాప మంటారు. ఇంతమందిని ఎలాపెంచగలరు అనడిగితే - అహోరాత్రులు శ్రమించి అని చెప్పరు.

మనం పెంచేది ఏముంది నారుపోసిన వాడు నీరుపోయడా అంటూ తప్పటడుగులు వేసే వయసు నుంచి 'తప్పు'టడుగులు వేసే వయసొచ్చేవరకు వారిని గాలికి వదిలేస్తారు.

అలాంటి తల్లిదండ్రుల్ని చూస్తే నాకు మంటగా ఉంటుంది. ఈ మాటకూ డా మీకు కోపమొచ్చింది కదూ. నా గురించి పూర్తిగా తెలుసుకుని నన్ను కోప్పడండి. ముందుగా కోప్పడితే మాత్రం నేనొప్పుకోను.



నాకు చదువంటే చాలా ఇష్టం. కానీ ఐదవ తరగతితోనే నా చదువాగిపోయింది. అప్పటినుంచే అమ్మ తనతో పాటు పనికి తీసుకెళ్ళ సాగింది.

అందరికంటే పెద్దదాన్ని కావడంతో కుటుంబ భారాన్ని మోయవలసిన బాధ్యత అంతచిన్న వయసులోనే నా మీద పడింది.

ఏడుస్తూ అమ్మతో పనికెళ్ళేదాన్ని. చదువు మానిపించేసిం దని అమ్మమీద చాలా కోపంగా ఉండేది. ఆ కోపంలో కూడా అమ్మ మాట వినేదాన్ని. ఇలా ఐదేళ్ళు గడిచాయి.

ఒకరోజు నాన్న స్నేహితుడట ఒకతను మ ఇంటికొచ్చాడు. వయసు ముప్పై ఐదు నలభై మధ్య ఉంటుంది.

అప్పుడు నా వయసు పద్నాలుగు. అమ్మ ఆ రోజు నన్ను పనికి తీసుకెళ్ళకుండా ఉన్నంతలో చక్కగా అలంకరించి అతని ముందు కూర్చోబెట్టింది.

అతను నావైపు ఆదోలా చూసిన చూపు, మీసాల చాటున నవ్విన నవ్వు అప్పుడర్థం కాలేదు నాకు. ఆ తరువాత పదిరోజులలో అతనితో నాకు పెళ్ళయింది.

పెళ్ళితంతు, ఆ హంగామా గందరగోళం చూసేసరికి నాకు భయమేసింది. అమ్మ ప్రతిక్షణం నా పక్కనే ఉండి నాకు పదేపదే ధైర్యం చెబుతూ ఓదార్చింది.

ఆ రోజు అమ్మానాన్నల ముఖాలు ఆనందంతో వెలిగిపోవడం నాకిప్పటికీ గుర్తే.

తర్వాత.

నాచేతికి పాలగ్లాసిచ్చి నన్నో గదిలోకి పంపారు. బెదురుగా భయంగా ఉండేసరికి అమ్మని తోడు రమ్మనీ మారాం చేశాను.

ముందు కోప్పడినా తరువాత బుజ్జగించి నన్ను గదిలోకి పంపేసరికి అమ్మకు తలప్రాణం అరికాల్లోకొచ్చిందనే చెప్పాలి.

గదిలోకి అడుగుపెట్టాను. అతను మంచం మీద నుండి లేచి నన్ను మంచం దగ్గిరకు తీసుకెళ్ళి, కూర్చోబెట్టి నాతో ఏవేవో మాట్లాడాడు.

నాకేం అర్థం కాలేదు. అతను నన్నాక్రమించుకోవాలని ప్రయత్నిస్తుంటే నాకు అతన్ని చంపేయాలన్నంత ఆవేశం వచ్చింది. తలుపు దగ్గరికి పరిగెత్తి తలుపులు బాదాను.

ఎవ్వరూ తలుపులు తియలెదు. అతను నన్ను ఎత్తుకెళ్ళి మంచంమీద పడేసి రాక్షసంగా అనుభవిస్తూంటే నేను పడిన నరకయాతన ఎలా చెప్పను. ఆ సమయంలో నాకు అమ్మానాన్నలను కత్తితో పొడి

చెయ్యాలన్నంత కోప మొచ్చింది.

ఆ రోజు నుండి ప్రతిరోజూ నాకా నరకయాతన తప్పలేదు. నాకు సంపూర్ణ యవ్వన ప్రాయమొచ్చేసరికి అతనికి పక్షవాతమొచ్చి మంచమెక్కాడు.

నేను అంతగా చదువుకోకపోయినా మానసికంగా ఎంతో ఎదిగాను. ఎన్నోరాత్రులు వయసు తెచ్చిన కోరికలకి సమాధానం చెప్పలేక నాలో నేను తపించిపోయాను.

ఆస్తి అంతస్థులు కొంచెం ఉన్నవాడని తండ్రి వయసుగల అతనికి ద్వితీయం చేసిన అమ్మానాన్నలంటే రోత కలిగింది.

కన్నవారి ప్రేమకు దూరమై- మంచంలో మూల్గుతూ పడుకున్న భర్తని చూస్తూ నిర్లిప్తంగా జీవించడం నేర్చుకున్నాను.

నాలోని కోరికలన్నీ చంపుకుని యాంత్రికంగా మరబొమ్మలా బతకడం అలవాటు చేసుకున్నాను.

అటువంటి సమయంలో మూర్తితో పరిచయం నా జీవితంలో వసంతం కురిపించిందనే చెప్పాలి మూర్తి నాకెంతో నచ్చాడు.

నా ఆలోచనలకూ, భావాలకూ తగినవాడుగా కనిపించాడు. అతని సమక్షంలో నా బాధలన్నీ మర్చిపోయేదాన్ని.

మేమిద్దరం స్నేహంగా ఉండటం చూసి చాలా మందికి అనుమానాలు రేకెత్తాయి. అందరిలాగే నా భర్తా అనుమానించేడు.. అయితే నన్ను కోపగించుకోలేదు.

ఒకరోజు నాతో "నువ్వు ఎవరితో సుఖంగా ఉన్నా నేను అడ్డు చెప్పను. నాకు భయపడి నీ జీవితాన్ని కోరికల్ని నాశనం చేసుకోవద్దు. నీకు నచ్చినవాడితో నువ్వు సుఖంగా ఉండు. నాకెటువంటి అభ్యంతరం లేదు. నావల్ల నీవు చాలా నష్టపోయావు. నేను మనస్ఫూర్తిగా ఒప్పుకుంటున్నాను" అన్నాడు.

ఆయనన్న మాటలకి నాకు చాలా కోపమొచ్చి- "నా గురించి మీరేమనుకుంటున్నారు. మీ కంటికి నేను బజారుదానిలా కనిపిస్తున్నానా" అని తిట్టాను.

ఆయన ఏడ్చేవాడు. బాధపడేవాడు. ఆయన్ని చూసి నేనూ ఏడ్చేదాన్ని-

అలా నేను మూర్తిని స్వచ్ఛంగా అభిమానిస్తుంటే... అతను ఎటువంటి వాడో ఈ రోజే బయటపడింది.

ఈ రోజు ఆయనికి ఆరోగ్యం క్షీణించిఉండటం తో అవతల వీధిలో ఉన్న హాస్పిటల్‌కి డాక్టర్ కోసం వెళ్ళాను. హాస్పిటల్ ఖాళీగా ఉంది.

మూర్తి, డాక్టర్ నా గురించి మాట్లాడుకుంటుండడంతో లోపలకి వెళ్ళబోతున్న నేను ఆగిపోయాను.

"ఇంకెంత, ఇంకో నాలుగురోజుల్లో దాన్ని తొక్కేస్తాను. అదిమాత్రం నేను ఎప్పుడెప్పుడు 'ఊ' అంటానా అని తహతహ లాడుతోంది. నేనే బయట పడటం లేదు. ఇప్పటికీ నన్ను చూస్తే ఓర్చుకోలేక పోతోంది. నేను ఇంకా అలస్యం చేస్తే... నన్ను తప్పకుండా 'రేప్' చేస్తుంది." అంటూ వికటంగా నవ్వుతున్న మూర్తి నవ్వుతో డాక్టర్ కూడా శృతి కలిపాడు.

జీవితంలో ఎంతగానో అభిమానించి స్నేహం చేసిన ఒక్కగానొక్క స్నేహితుడు అలా మాట్లాడేసరికి ఓర్చుకోలేక పోయాను.

ఆడపిల్ల స్వచ్ఛమైన మనసుతో స్నేహం చేస్తే ఆ స్నేహానికి ఏ మగాడు విలువివ్వడనే 'ప్రపంచ సత్యం నాకు అనుభవపూర్వకంగా అర్థమైంది.

అదుగో! రోజూలా చాలా హుషారుగా అమాయకంగా నవ్వుతూ వస్తున్నాడు మూర్తి.


ఇకరావద్దని చెప్పెయ్యాలి అనుకుంటూ గుమ్మంలో నుండి లేచి నిలబడ్డాను.

కె. సూరిబాబు
హెచ్.నం.1-2-234/46/సి,
దోమలగూడ,
హైదరాబాదు - 500 029.

## క్రేజ్



హీరోలు ఆడవేషాలు వేయడం ఈ మధ్య బాగా క్రేజ్ అయిపోయింది. అయితే ఒకే సినిమాలో ఇద్దరేసి ముగ్గురేసి హీరోలు ఆడవేషాలు వెయ్యడం విశేషంగానే చెప్పాలి. ఆ మధ్య 'తెహల్కా' చిత్రంలో నసీరుద్దీన్‌షా, ఆదిత్య పంచోలీ, జావేద్ జాఫ్రీలు ఆడవేషం వేశారు. ఇప్పుడు తాజాగా 'కూలీ నెం.1' అనే హిందీ సినిమాలో గోవిందతో పాటు హరీష్ (మన తెలుగు హరీషే) కూడా ఆడవేషంలో కనిపించబోతున్నాడు. ఇదో రకం క్రేజ్!




బుడన మస్తాన్‌బాబు ఇ.నం 16/4/478 జోసులవారిపేట. చిలకలపూడి.కృష్ణాజిల్లా - 521 002.